సాక్షి నంద్యాల

శుక్రవారం । 17 । నవంబర్ । 2023



భ్రామరీకి ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబాదేవికి మూలన క్షత్రం సందర్భంగా ఊయలసేవను నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల మూర్తులను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



కరువులో 'డ్రాగన్' సిరులు

కరువులో డ్రాగన్ ఫ్రూట్ సాగు కలసివస్తోంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేసుకోవచ్చు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 300 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. 8లో▸



క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. 8లో▸

న్యూస్‌రీల్

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం



కర్నూలుకు చెందిన దాతకు బాండును అందజేస్తున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సింహాద్రి అప్పన్న రూ.1,00,116లు, కర్నూలుకు చెందిన వెంకటేశ్వర రెడ్డి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలో అధికారులకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, బాండు, జ్ఞాపికను అందజేశారు.

అన్నదాతలకు ఈ-క్రాప్ రసీదులు

నంద్యాల(సెంట్రల్): ఖరీఫ్‌లో ఈ-క్రాప్, ఈ-కేవైసీ చేయించుకున్న రైతులందరికీ రసీదులు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారులను ఆదేశించినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహనరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుకు సంబంధించి ఈ-క్రాప్ చేయించుకున్నట్లు రైతుల దగ్గర ఆధారం ఉంటే భవిష్యత్తులో ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ అమ్మకాలు, సున్నావడ్డీకి పంట రుణాలకు ఇబ్బంది ఉండదన్నారు. ఈ-క్రాప్, ఈ-కేవైసీ ప్రక్రియ చేయించిన రైతులకు మాత్రమే ప్రభుత్వం నుంచి సంక్షిప్త సందేశాలు చేరుతాయన్నారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

- మరో ఉపాధ్యాయుడికి చార్జ్‌మెమో

నంద్యాల(న్యూటౌన్)/బనగానపల్లె రూరల్: బనగానపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు మాధవస్వామిపై సస్పెండ్ వేటు పడింది. అదే పాఠశాలకు చెందిన మరో ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డికి చార్జ్‌మెమో జారీ అయ్యింది. డీఈవో సుధాకర్ రెడ్డి గురువారం తెలిపిన వివరాల మేరకు...బనగానపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8వ తేదీన ప్రధానోపాధ్యాయురాలు జానకికి వ్యతిరేకంగా విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ విషయంపై డీఈవో ఈనెల 14న పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. కాగా విద్యార్థులను ధర్నాకు ఉపాధ్యాయుడు మాధవస్వామి ప్రోత్సహించారని, ప్రధానోపాధ్యాయురాలికి వ్యతిరేకంగా మాట్లాడినట్లు విచారణలో తేలింది. ఈ మేరకు వారిపై చర్యలు చేపట్టినట్లు డీఈఓ తెలిపారు. ఈ విషయాన్ని విద్యాశాఖ కడప ప్రాంతీయ సంచాలకులకు నివేదిక రూపంలో సమర్పించామన్నారు. విద్యాశాఖ ఉద్యోగులు విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, చర్యలు తప్పవని హెచ్చరించారు.

అమల్లో సీఎం హామీ

కర్నూలు(అర్బన్): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట తప్పరనే ప్రజల్లో ఉన్న బలమైన నమ్మకం మరోసారి రుజువైంది. ఈ ఏడాది జూన్ 1న పత్తికొండకు వచ్చిన ఆయనను నియోజకవర్గంలోని పలు రోడ్లకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కోరారు. ఈ నేపథ్యంలోనే రూ.13.30 కోట్లతో ఒక బ్రిడ్జి నిర్మాణానికి, రెండు రోడ్ల అభివృద్ధికి పాలనా అనుమతులు మంజూరయ్యాయి. రూ.7.95 కోట్లతో కృష్ణగిరి మండలం టి.గోకులపాడు నుంచి రామక్రిష్ణాపురం వరకు హంద్రీ నదిపై బ్రిడ్జి నిర్మాణానికి పాలనా అనుమతులు మంజూరు చేస్తు పీఆర్ అండ్ ఆర్‌డీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బి.రాజశేఖర్ జీఓఆర్‌టీ నెం.782 జారీ చేశారు. అలాగే రూ.3 కోట్లతో అదే మండలం కోయిలకొండ నుంచి కంబాలపాడు వరకు బీటీ సర్ఫేస్ రోడ్డు నిర్మాణానికి, తుగ్గలి మండలం మార్గెళ్ల నుంచి నునుసురాళ్ల వరకు (వయా బొందిమడుగుల) బీటీ రెన్యూవల్స్‌కు రూ.2.35 కోట్లతో పాలనా అనుమతులు వచ్చాయి.

18 నుంచి పేదలకు భూ పంపిణీ

కర్నూలు(సెంట్రల్): ఈనెల 18 నుంచి వారం రోజులపాటు పేదలకు భూపంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు. గురువారం సాయంత్రం ఆమె తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో భూమిలేని 2,582మంది పేదలకు 3,002.18 ఎకరాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు అసైన్‌మెంట్ కమిటీ నిష్పక్షపాతంగా లబ్ధిదారులను గుర్తించినట్లు చెప్పారు. అలాగే 20 ఏళ్ల అనుభవం ఉన్న అసైన్డ్‌దారులకు హక్కులు కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 3,103 మంది అసైన్డ్ భూములు ఉన్న రైతులకు సంబంధించి 5,781.375 ఎకరాలను నిషేధిత జాబితా 22ఏ నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. అలాగే 23,838.92 ఎకరాల్లో అనుభవం ఉన్న సర్వీసు ఇనాం దారులకు హక్కులు కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో శ్మశానాలు లేని 103 దళిత వాడలకు 54.77 ఎకరాలను కేటాయించినట్లు ఆమె వివరించారు.

ఉపాధి వెల్లువై.. లక్ష్యానికి చేరువై

- వర్షాభావ పరిస్థితుల్లో ఆదుకుంటున్న ఉపాధి పనులు
- రోజురోజుకు పెరుగుతున్న హాజరు శాతం
- రికార్డు స్థాయిలో కుటుంబాలకు లబ్ధి
- లక్ష్యంలో ఇప్పటికే 89 శాతం పూర్తి
- కూలీలకు రూ.145 కోట్లకు పైగా చెల్లింపులు



బనగానపల్లె మండలంలోని చెరుపల్లె అక్కజమ్మ చెరువులో ఉపాధి పనుల దృశ్యం

నంద్యాల(సెంట్రల్): సమృద్ధిగా సాగు నీటి వనరులు ఉండే నంద్యాల జిల్లాలో ఏడాది పొడవునా వ్యవసాయ పనులు ఉంటాయి. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గిపోయి వ్యవసాయ పనులు కొంత తగ్గాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు ఎంతో ఆదుకుంటున్నాయి. ఉన్న ఊళ్లోనే అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి పనులను విస్తృతంగా కల్పిస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 70 లక్షల పనిదినాల లక్ష్యానికి గాను ఇప్పటికే రికార్డు స్థాయిలో 62.88 లక్షల పనిదినాలు పూర్తి చేసి, 89 శాతం ప్రగతిని నమోదు చేశారు. అలాగే ఒక్కో కుటుంబానికి 100 రోజుల పనిదినాలను కల్పించాలనే లక్ష్యంతో అధికారులు ముందుకెళ్తున్నారు. ఉపాధి కూలీలకు చెల్లింపుల రూపంలో ఇప్పటి వరకు రూ.153 కోట్లు చెల్లించారు. వాస్తవానికి ఉపాధి పనులకు హాజరయ్యే వారికి రోజుకు రూ.272 చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతానికి రూ.252 మేర అందిస్తున్న కూలీని రానున్న రోజుల్లో రూ.272కు పెంచేలా డ్వామా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. దీంతో పాటు మెటీరియల్ కాంపొనెంట్ ద్వారా పలు నిర్మాణాల కోసం ఈ ఆర్థిక సంవత్సరం రూ. 57.69 కోట్లు ఖర్చు చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 70.42 లక్షల పనిదినాలను కల్పించి కూలీలకు సుమారు రూ.149 కోట్లు చెల్లించారు. అలాగే మెటీరియల్ కాంపొనెంట్ ఖర్చుల కింద రూ.118 కోట్లు ఖర్చు చేశారు.

2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉపాధి పనుల వివరాలు

మొత్తం జాబ్ కార్డులు	2,80,831
వినియోగంలో ఉన్నవి	1,74,777
పని దినాల లక్ష్యం	70 లక్షలు
హాజరైన కూలీలు	62,88,417
పనులు కల్పించిన కుటుంబాల సంఖ్య	1,56,865
ప్రగతి శాతం	89.69
కూలీలకు చెల్లించిన మొత్తం	15,231.97 (లక్షల్లో)
మెటీరియల్ కాంపొనెంట్ ఖర్చు	రూ.5,769.99 (లక్షల్లో)

ఊరూరా పనులు..

ఉపాధి హామీ పథకం పనులను వ్యవసాయానికి ఊతమిచ్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. చెరువుల్లో మట్టి తీయడం, కాలువలు తవ్వటం, మొక్కలు నాటడం, తదితర పనులు చేపడుతున్నారు. అమృత్ సరోవర్ కింద జిల్లా వ్యాప్తంగా 74 చెరువుల్ని పునరుద్ధరించటంతో పాటు, కొత్తగా 4 చెరువులు తవ్వి స్థానికులకు విస్తృతంగా ఉపాధి కల్పించారు. ఉదయం పది గంటల వరకు పనులకు హాజరైన కొంతమంది కూలీలు భోజనం చేసి ఇతర పనులకు వెళ్తున్నారు. పనులు పూర్తయిన అనంతరం కొలతలను ఉపాధి హామీ సిబ్బంది సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఉపాధి కూలీలకు వేతనాలను వారి బ్యాంక్ ఖాతాలకు మరుసటి వారమే జమ చేస్తున్నారు. డోన్, ప్యాపిలి, సంజామల, బేతంచెర్ల, మిడ్తూరు, కొలిమిగుండ్ల తదితర మండలాల్లో ఉపాధి పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు.

సద్వినియోగం చేసుకుంటున్నాం



ఉపాధి పనులు సంతృప్త స్థాయిలో కల్పిస్తున్నారు. పనులు చేసిన వెంటనే కూలి వేతనం బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. ఎక్కువ ఆదాయం ఆశించే వారు మాత్రమే పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు. అలాంటి వారు పండగలు, శుభకార్యాలకు మాత్రమే వచ్చి వెళ్తుంటారు. ఈ ఏడాది వర్షాలు సరిగా లేకపోవటంతో ఆందోళన పడ్డాం. కానీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పనులు కల్పించి ఆదుకున్నారు.

– నాగలక్ష్మమ్మ, బూజునూరు, గడివేముల మండలం

ఉపాధి పనులకే వెళ్తున్నా



మా ఊరిలో అడిగిన వారందరికీ ఉపాధి పథకం పనులు కల్పిస్తున్నారు. వలసలు వెళ్లాల్సిన అవసరం ఏ ఒక్కరికీ లేదు. ఇప్పటికే చాలా మంది వంద రోజుల పని దినాలు కూడా పూర్తి చేశారు. కరోనా సమయంలోనూ ఏ లోటూ లేకుండా పనులు కల్పించి ఆకలి బాధలు తీర్చారు. గత నాలుగేళ్లుగా సమృద్ధిగా పని దొరికి ఊళ్లోనే ఆనందంగా ఉన్నాం. సీఎం జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

– గుర్రప్ప, నొస్సం, సంజామల మండలం

వలసలన్న మాటే లేదు



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గత నాలుగేళ్లలో సమృద్ధిగా పనులు కల్పించాం. కోరిన ప్రతి ఒక్కరికీ పని ఇవ్వటంతో పాటు, విలువైన ఆస్తుల్ని సృష్టించాం. జిల్లా వ్యాప్తంగా 74 చెరువుల్ని పునరుద్ధరించటంతో పాటు, 4 నూతన చెరువుల్ని నిర్మించాం. ఉద్యాన పంటల సాగు లక్ష్యం 5 వేల ఎకరాలకు గాను ఇప్పటి వరకు 3,500 ఎకరాల్లో సాగు చేయించి చేయూతనిస్తున్నాం. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఉన్నా వలసలన్న మాట లేదు. ఊరూరా ఉపాధి పనులపై అవగాహన కల్పించి అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నాం.

– రామచంద్రారెడ్డి, పథక సంచాలకులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ

స్పష్టమైన ముసాయిదా ఓటరు జాబితా రూపొందిస్తున్నాం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ

నంద్యాల: జిల్లాలో స్పష్టమైన ముసాయిదా ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శ్యామూన్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. గురువారం విజయవాడలోని ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. నంద్యాల నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ, డీఆర్‌ఓ పుల్లయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ నాటి నుంచి ఇప్పటి వరకు ఫారం -6 దరఖాస్తులు 20,319, ఫారం-7 దరఖాస్తులు 11,528, ఫారం-8 దరఖాస్తులు 8907 పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. పెండింగ్‌లో వున్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారులు, తహసీల్దారులకు తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎపిక్ కార్డుల జనరేషన్‌కు చర్యలు తీసుకుంటామని కమిషనర్‌కు నివేదించారు. జిల్లాలో ముఖ్యంగా 18, 19 ఏళ్ల యువ ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్డీవోలు శ్రీనివాసులు, ఎం.దాసు, వెంకటరెడ్డి, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు.

రేపు బనగానపల్లెకు మంత్రుల రాక

బనగానపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోని సమావేశ భవనంలో ఈనెల 18వ తేదీన మైనింగ్ అంశంపై నిర్వహించే సమావేశానికి మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గురువారం తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గంలో నాపరాతి మైనింగ్ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున మైనింగ్ సమస్యల పరిష్కారానికి సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని మైనింగ్ లీజుదారులు, నాపరాతి పరిశ్రమ యజమానులు హాజరై తమ సమస్యలను మైనింగ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు.

రవాణా శాఖ అధికారి ఇంట్లో ఏసీబీ సోదాలు





సువర్ణ కుమారి, ఆమె నివాసం




నగదును లెక్కిస్తున్న ఏసీబీ అధికారులు

కర్నూలు: రవాణా శాఖ నంద్యాల కార్యాలయ పరిపాలన అధికారి(ఏఓ) సువర్ణ కుమారి ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఏకకాలంలో ఆరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. కర్నూలు కేంద్రీయ విద్యాలయానికి ఎదురుగా ఉన్న ధనలక్ష్మి నగర్‌లో ఆమె నివాసం ఉంటున్నారు. ఈమె సోదరుడు వరప్రసాద్ హైదరాబాద్, చెల్లెలు సుభాషిణి కర్నూలులోని రాగమయూరి, మరో సోదరి మార్కాపురంలో నివసిస్తున్నారు. వీరి ఇళ్లతో పాటు నంద్యాల ఆఫీసు, బనగానపల్లె (ఆర్‌టీఓ ఏజెంట్ రాజేంద్ర) ఇంట్లో ఏసీబీ అధికారులు బృందాలుగా ఏర్పడి గురువారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి నేతృత్వంలో సీఐలు తేజేశ్వరరావు, కృష్ణారెడ్డి, వంశీనాథ్, శ్రీనివాసరెడ్డి, ఇంతియాజ్, అపర్ణ, కృష్ణయ్య తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు. ఆమె నివాసముంటున్న ఇంట్లో దాదాపు రూ.10 లక్షల నగదు, 15 బ్యాంకు ఖాతాలు, భారీగా బంగారు, వెండి ఆభరణాలు బయటపడ్డాయి. ధనలక్ష్మి నగర్‌లో జీ+1 ఇంటితో పాటు కర్నూలు ఆంధ్రా బ్యాంకులో లాకర్, ఆరు ప్రాంతాల్లో విలువైన ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. 2005లో రవాణా శాఖలో ఈమె స్టెనోగా విధుల్లో చేరారు. ఎక్కువ కాలం కర్నూలు డీటీసీ కార్యాలయంలో పనిచేశారు. ఈమెకు ఉన్న ఆస్తులు సక్రమమైనవా, అక్రమంగా సంపాదించారా అనే కోణంలో అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. శుక్రవారం కూడా తనిఖీలు కొనసాగే అవకాశం ఉన్నట్లు డీఎస్పీ వెంకటాద్రి తెలిపారు.

నమక చమకాలు పఠిస్తే పుణ్యప్రదం

శ్రీశైలంటెంపుల్: నమకచమకాలను భక్తితో విన్నా, పఠించినా ఎంతో పుణ్యప్రదమని, ఇహ పరసౌఖ్యాలు తప్పక లభిస్తాయని బృహత్ ద్విసహస్రావధాని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. కార్తీకమాసోత్సవాల సందర్భంగా శ్రీశైల దేవస్థానం పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా గురువారం రాత్రి నాగఫణిశర్మ చే 'నమక చమక వైభవం' అనే ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలం, కాశీ క్షేత్రాలు వేదంలోని నమకం-చమకంలాంటివి అన్నారు. రుద్రం అంటే నమక చమకాల కలయిక అన్నారు. ఈ రుద్రమంత్రాలతో శివలింగంపై సంతతధారగా జలాన్ని పోయడాన్ని రుద్రాభిషేకం అంటారన్నారు. చమకం అంటే ఈ విశ్వమంతా రుద్రుడు ఉన్నాడనే తత్వాన్ని తెలియజేస్తుందన్నారు. శ్రీశైలక్షేత్రంలో కేవలం ఒక్కరోజు నివసించినంత మాత్రాన ఇహంలో అష్టైశ్వర్యాలు, పరంలో మోక్షం లభిస్తుందన్నారు.



ప్రవచనాన్ని వినిపిస్తున్న నాగఫణిశర్మ

సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

- సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బనగానపల్లె: నియోజకవర్గానికి ఈనెల 22న చేరుకునే వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోని సమావేశ భవనంలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సామాజిక సాధికార బస్సు యాత్రపై ఎమ్మెల్యే రామిరెడ్డి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేశారన్నారు. టీడీపీ హయాంలో సామాజిక వర్గాలను ఓటు బ్యాంక్‌గానే వాడుకున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ బస్సు యాత్ర విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు, ఇతర నాయకులు హాజరై నాలుగున్నర ఏళ్లలో అన్ని వర్గాల సంక్షేమ కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరిస్తారన్నారు. జగనన్న పాలనలో పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు లభించినట్లు పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టి, మళ్లీ జగన్‌నే సీఎం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బనగానపల్లె నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వర రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు అనిల్, నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, శంకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, డీలర్ నారాయణ, ఈశ్వర్‌నాయక్, వెంకట్రామిరెడ్డి, హనుమంత రెడ్డి, మోహన్‌బాబు, పాపన్నతోట బుచ్చిరెడ్డి, గడ్డం వెంకటేశ్వరరెడ్డి, కాటసాని రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరు, మహేష్ మధు కంబగిరి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, బూత్‌కన్వీనర్లు గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



సమీక్ష నిర్వహిస్తున్న చీఫ్ కన్జర్వేటర్ రామకృష్ణ

కర్నూలు కల్చరల్: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ పి.రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన కర్నూలు సర్కిల్ అటవీ శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవులు, అటవీ ప్రాంత ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలప అక్రమ రవాణాను నిరోధించాలన్నారు. సీఏఎంపీఏ స్కీం అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలన్నారు. నిర్దేశించిన గడువులోగా ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. కర్నూలు ఇన్‌ఛార్జి డీఎఫ్‌ఓ నాగార్జున రెడ్డి, వైఎస్సార్ కడప డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి, రెడ్ శాండల్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ గురుప్రభాకర్ రెడ్డి, నంద్యాల సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌ఓ వెంకటేశ్వర రావు, ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్‌ఓ దివాకర్, ఎఫ్ఆర్‌వోలు, డీఆర్‌వోలు సమీక్షలో పాల్గొన్నారు.

4,165 క్యూసెక్కుల నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి బుధవారం నుంచి గురువారం వరకు దిగువ ప్రాంతాలకు 4,165 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 490, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,150 క్యూసెక్కుల నీరు విడుదలైంది. ప్రస్తుతం జలాశయంలో 64.0542 టీఎంసీల నీరు నిల్వగా ఉండగా, డ్యాం నీటిమట్టం 841.50 అడుగులకు చేరుకుంది.

సంక్షేమ బావుటా



30 ఏళ్ల కల నెరవేరింది



మా స్వగ్రామం హనుమంతుగుండం. పనుల కోసం 30 ఏళ్ల క్రితం కొలిమిగుండ్లకు చేరుకున్నాం. అప్పటి నుంచి అద్దె ఇళ్లలోనే ఇరుక్కుగా పిల్లలతో గడిపాం. ఇంటి యజమానులు అద్దె పెంచిన ప్రతిసారి మరో ఇంటిని వెతుకునేవాళ్లం. గతంలో ఇంటి స్థలం మంజూరు చేయమని దరఖాస్తు చేసుకున్నా వచ్చేది కాదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాతనే పేదలకు న్యాయం జరుగుతోంది. వలంటీరు నేరుగా మా వద్దకు వచ్చి మా వివరాలు తెలుసుకున్నారు. మేము అడగకుండానే ప్రభుత్వం జగనన్న కాలనీలో స్థలం మంజూరు చేసింది. ఇల్లు కట్టుకునేందుకు డబ్బులు ఇచ్చింది. ఉన్నంతలో బాగా కట్టుకున్నాం. ఇటీవలనే గృహప్రవేశం చేశాం. 30 ఏళ్ల తర్వాత సొంతింటి కల నెరవేరడంతో చాలా..చాలా సంతోషంగా ఉంది.

– శ్రీరాముల నయోమి, కొలిమిగుండ్ల

ప్రైవేటు వెంచర్‌లో ఉన్నట్లుగా ఉంది



మా అమ్మ లక్ష్మీబాయికి మేము నల్గురు సంతానం. చిన్న పాటి ఇంట్లో అందరం ఇబ్బంది పడుతూ జీవిస్తున్నాం. నేను ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. ఇల్లు కట్టుకోవాలని ఉన్నా ఆర్థిక ఇబ్బందులతో సాధ్యమయ్యేది కాదు. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాలాంటి పేదల సొంతింటి కల నెరవేరుతోంది. జగనన్న లే అవుట్ కాలనీలో సెంటున్నర ఇంటి స్థలం మంజూరు చేశారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇవ్వడంతో పనులు ప్రారంభించా. రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించారు. ప్రైవేటు వెంచర్‌లో ఇల్లు కడుతున్నట్లుగా ఉంది. పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతోంది. – గంగాధర్ రావు, అంబాపురం గ్రామం, బేతంచెర్ల మండలం

మళ్లీ జగనే సీఎం



జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే పేదలకు మేలు చేస్తారని ముందే అనుకున్నాం. మేము ఊహించినట్లుగా హామీలన్నీ నెరవేర్చుతున్నారు. కొన్నేళ్లుగా పూరి గుడిసెలోనే పిల్లలతో ఉన్నాం. ఏ నాయకుడు, అధికారులను ఆశ్రయించకుండానే మాకు ఇంటి స్థలం వచ్చింది. పక్కా ఇల్లు కట్టుకుంటున్నాం. త్వరలో కొత్తింటికి చేరుతాం. పేదరాలిని అయిన నన్ను ఇంటికి యజమానిని చేసి రూ. లక్షల విలువైన ఆస్తి ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి నిండు మనసుతో కృతజ్ఞత చెబుతున్నాను. మాకు గూడు కల్పించిన జగనన్నకు మేము ఎప్పుడూ వెంటే ఉంటాం. పేదలందరూ కలసి సీఎంగా మళ్లీ జగన్‌ను గెలిపిస్తారు.

– ముంతాజ్, ఆత్మకూరు

క్లుప్తంగా

ఆన్‌లైన్‌లో క్రెడిట్‌కార్డు మోసం

- పోలీసులకు ఫిర్యాదు చేసి బాధితులు

ఆదోనిఅర్బన్: ఆన్‌లైన్‌లో క్రెడిట్ కార్డు మోసం జరిగిందని టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్‌కు ఎంఎం కాలనీకి చెందిన సూర్య, మాధవ్, మురళీమోహన్, నాగశైన ఫిర్యాదు చేశారు. తమ ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఫొటోస్ పెట్టి ఫేక్ మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్‌తో క్రెడిట్ కార్డు తీసుకుని 2021 డిసెంబర్ 17, 19వ తేదీల్లో రూ.13,500 డ్రా చేశారని, దని యాప్ వారు తమను డబ్బు కట్టాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. వడ్డీతో కలిపి రూ.25 వేలు కట్టాలంటున్నారని సీఐకు వివరించారు. సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసి తమకు ఎఫ్‌ఐఆర్ కాపీని ఇస్తే వెంటనే క్రెడిట్‌కార్డును ఆపి వేస్తామని, రికవరీ ఏజెంట్లు తెలిపారని బాధితులు సీఐకు తెలియజేశారు.

పోలీసు శాఖపై నిరాధారణ ఆరోపణలు సహించేది లేదు



ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: నిరంతరం జిల్లా ప్రజల శాంతిభద్రతలో విరామం లేకుండా విధులు కొనసాగిస్తున్న పోలీసు శాఖ ప్రతిష్ఠ దిగజార్చేలా నిరాధారమైన కథనాలు పత్రికల్లో ప్రచురిస్తే సహించేది లేదని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. వన్‌టౌన్ పరిధిలో గత ఆరు నెలల క్రితం చిన్నబాబు అనే యువకుడు తన వ్యక్తిగత కారణాల వల్ల రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే బైక్ దొంగతనం కేసులో చిన్నబాబును పోలీసులు కావాలనే ఇరికించి చేయని నేరాన్ని ఒప్పుకోవాలని బలవంతం చేసినట్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైందన్నారు. తన కుమారుని ఆత్మహత్యకు పోలీసులు కారణం కాదంటూ చిన్నబాబు తల్లి సంఘటన జరిగిన రోజే మీడియా ఎదుట ఒప్పుకున్నారని, అయినా పోలీసులే తప్పు చేశారని అవాస్తవాలు రాయటం సమంజసం కాదన్నారు. అదేవిధంగా ఈనెల 11వ తేదీ గోస్పాడు మండలం చింతకుంట గ్రామానికి చెందిన బాలనరసింహుడు తన వ్యక్తిగత కారణాలతో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఆంధ్రజ్యోతి పత్రికలో పోలీసుల ప్రతిష్ఠను దిగజార్చేలా నిరాధారమైన వార్తలను ప్రచురించటం సరైందికాదన్నారు. బాలనరసింహుడును గోస్పాడు పోలీసులు దూషించి, కొట్టారని పత్రికలో నిరాధారమైన వార్తను ప్రచురించారని పేర్కొన్నారు. బాధితులు చెప్పిన వాస్తవాలను రాయకుండా వాటికి విరుద్ధంగా ఆంధ్రజ్యోతి అవాస్తవాలు ప్రచురించడం సరికాదని ఇకపై ఇదే కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కరువులో 'డ్రాగన్' సిరులు

- కలసి వస్తున్న డ్రాగన్‌ఫ్రూట్ సాగు
- ట్రెల్లీస్ విధానంలో రాణిస్తున్న రవీంద్రకుమార్
- రెండేళ్లలో 6 టన్నులకుపైగా దిగుబడి
- అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం



ట్రెల్లీస్ విధానంలో డ్రాగన్‌ఫ్రూట్ సాగు

కర్నూలు(అగ్రికల్చర్): కరువులో డ్రాగన్ ఫ్రూట్ సాగు కలసివస్తోంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేసుకోవచ్చు. గతంలో ఒకరిద్దరి రైతులకే పరిమితమైన తోటలు ఏడాదికేదాది అభివృద్ధి చెందాయి. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 300 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేసే రైతుకు గరిష్ఠంగా రూ.1.90 లక్షలు సబ్సిడీ ఇస్తోంది. గతంలో దిమ్మెలు పాతి దానిపై టైర్/బండి చక్రం అమర్చడం ద్వారా మొక్కలు పైకిపాకే ఏర్పాటు చేసేవారు. నేడు ట్రెల్లీస్ విధానంలో(దిమ్మెలపై టైరు/బండి చక్రం అవసరం లేకుండా తీగలతో) తోటలు అభివృద్ధి చేస్తున్నారు.

మొదటి పంటలోనే రూ.6 లక్షల ఆదాయం

దేవనకొండ మండలం వరిముక్కల గ్రామానికి చెందిన కంది రవీంద్రకుమార్ యాదవ్ ట్రెల్లీస్ విధానంలో డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేస్తున్నారు. ఈయన కేవలం 10వ తరగతి వరకు చదువుకున్నారు. మొదటి పంటలోనే రూ. 6 లక్షల ఆదాయం పొందారు. నరసరావుపేట నుంచి మొక్క రూ.60 ప్రకారం తెప్పించి 2021లో నాటుకున్నారు. సాలుకు, సాగుకు మధ్య 14 అడుగులు, దిమ్మెకు, దిమ్మెకు మధ్య 14 అడుగుల దారంలో పోల్స్ నాటుకున్నారు. పోల్స్‌కు విద్యుత్ లైన్ తరహాలో 4 వరుసలతో లైన్ వేశారు. పోల్స్ కింద ఒక దానిపైన ఒకటి ప్రకారం మూడు వైర్లు లాగారు. ఈ వైర్ల కింద అడుగు, అడుగు దూరంలో డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు నాటుకున్నారు. మొక్కలు తీగ తరహాలో పైకి పెరుగుతూ... పైన వేసిన నాలుగు లైన్‌లు వేసి తీగలపై అల్లుకున్నాయి. దిమ్మెలపై టైరు/బండి చక్రం అవసరం లేకుండా పోయింది. ఎకరన్నర భూమిలో ఏకంగా 7వేల మొక్కలు నాటుకోగా.. పెట్టుబడి వ్యయం రూ.16 లక్షల వరకు వచ్చింది.

ఐదేళ్ల నుంచి పెరగనున్న దిగుబడులు

పంటకు కేవలం పశువుల ఎరువులు మాత్రమే ఉపయోగిస్తున్నారు. నాటిన ఏడాదిలోపే 2022 ఆగస్టులో కాపు మొదలైంది. మొదటి పంటలో కేవలం 3 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. 2023లో దిగుబడి బాగా పెరిగింది. ఈ ఏడాది జూన్‌లో మొదలైన పంట నవంబరు నెలతో ముగింపునకు వస్తోంది. ఈ ఏడాది ఏకంగా 60 క్వింటాళ్ళ దిగుబడి వచ్చింది. టన్ను రూ.లక్ష ప్రకారం విక్రయించారు. ఇప్పటి వరకు రూ.6 లక్షలకుపైగా ఆదాయం పొందారు. వచ్చే ఏడాది మొక్కకు 20 వరకు పండ్లు వస్తాయి. ఇవి 4 కిలోల వరకు ఉంటాయి. ఈ ప్రకారం 28 టన్నుల వరకు దిగుబడి పెరుగనుంది. నాటిన ఐదేళ్ల నుంచి దిగుబడి గరిష్ఠస్థాయికి చేరుతుంది.

అంతరపంటగా వేరుశనగ

సాలుకు, సాలుకు మధ్య 14 అడుగులు ఉండటంతో ట్రాక్టరుతో సేద్యం చేసుకోవచ్చు. ప్రతి ఏటా అంతరపంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడింది. డ్రాగన్‌ఫ్రూట్ మొక్కలకు ఆకులు రావు. తీగలపైనే అల్లుకుంటాయి. మధ్య ఖాళీగా ఉన్న భూమిలో అంతరపంటగా వేరుశనగ సాగు చేసి అదనపు ఆదాయం పొందుతున్నారు. డ్రాగన్‌ఫ్రూట్ తోటకు మల్చింగ్ సదుపాయం కూడా కల్పించుకున్నారు. దీంతో కలుపు సమస్య లేకుండా పోయింది. తేమ కూడా ఆరిపోదు.. ప్లాస్టిక్ షీట్లకు అడగు, అడుగు దూరంలో రంధ్రాలు వేసి మొక్కలు నాటారు. మలి్చంగ్ వల్ల మొక్క ఆరోగ్యంగా పెరుగుతోంది. ఏపీఎంఐపీ ద్వారా సూక్ష్మ సేద్యం కల్పించుకున్నారు.

మూడు నెలలు అధ్యయనం చేశా



డ్రాగన్‌ఫ్రూట్స్ సాగు చేసే ముందు మూడు నెలలు అధ్యయనం చేశా. ఒక అవగాహనకు వచ్చాక ట్రెల్లీస్ విధానంలో మొక్కలు నాటుకున్నా. మల్చింగ్, పోల్స్, వైర్లు, మొక్కలు తదితర వాటికి పెట్టుబడి కింద రూ.16 లక్షల ఖర్చు వచ్చింది. డ్రాగన్ ఫ్రూట్స్ సాగుకు ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం రూ.1.90 లక్షల సబ్సిడీ ఇచ్చింది. ఏపీ ఎంఐపీ కింద డ్రిప్ కూడా మంజూరైంది.

– కంది రవీంద్రకుమార్ యాదవ్

సాగును ప్రోత్సహిస్తున్నాం



డ్రాగన్ ఫ్రూట్ సాగును ప్రోత్సహిస్తున్నాం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సన్న, చిన్నకారు రైతులకు గరిష్ఠంగా రూ.1.90 లక్షలు సబ్సిడీగా ఇస్తున్నాం. దేవనకొండ మండలం వరిముక్కల గ్రామానికి చెందిన రవీంద్రకుమార్ డ్రాగన్ ఫ్రూట్ సాగులో రాణిస్తున్నారు.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

గ్రామ స్థాయిలో గ్రంథాలయ సేవలు



మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

కర్నూలు కల్చరల్: గ్రంథాలయ సేవలను గ్రామ స్థాయిలో విస్తరిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. సుభాష్‌చంద్రబోస్ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. గ్రంథాలయ వారోత్సవాలను ప్రజలకు, విద్యార్థులకు ఉపయోగ పడే విధంగా జరుపుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్థాయిలో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ కె.ఆంజనేయులు మాట్లాడుతూ సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా పుస్తక పఠనం చేస్తే విజ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పెద్దక్క, నైస్ కంప్యూటర్స్ అధినేత రాయపాటి శ్రీనివాస్, లైబ్రేరియన్లు వజ్రాల గోవింద రెడ్డి, బాషా, చంద్రమ్మ, నిఖిలేష్ అకాడమీ సంస్థ అధ్యక్షులు మద్దిలేటి, సీనియర్ కళాకారులు హెచ్.చంద్రన్న, రాజారత్నం, సహదేవరెడ్డి, తెలుగు బాషా వికాస ఉద్యమ కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ పాల్గొన్నారు.

రుణాల చెల్లింపులో రైతులు ఆదర్శం

దొర్నిపాడు: సహకార సంఘంలో రుణాలు పొంది వాటిని తిరిగి చెల్లించడంతో పాటు ఎదైనా సమస్య వచ్చినప్పుడు స్పందించే తీరు ఆదర్శనీయమని రిజర్వు బ్యాంక్ ఏజీఎం రెహమాన్ అన్నారు. గురువారం గుండుపాపల సొసైటీ ఆవరణలో అధ్యక్షుడు బాలవెంకటరెడ్డి అధ్యక్షతన జిల్లా సహకార కేంద్రబ్యాంక్ వారి ఆధ్వర్యంలో అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రుణాల మంజూరుపై రైతుల సందేహాలకు ఆయన వివరణ ఇచ్చారు. 7శాతం వడ్డీ రాయితీని రూ.3లక్షలకు కాకుండా రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. అలాగే ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పంట రుణాల పరిమితిని పెంచాలని రైతులు కోరాగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఏటీఎం వినియోగం, వాటిని పట్ల బ్యాంకు ద్వారా లభించే వివిధ రకాల రుణాల గూర్చి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రవీంద్ర వివరించారు. కార్యక్రమంలో సహకార విద్యా ప్రభోదకులు నరసింహారెడ్డి, కోవెలకుంట్ల సహకార చీఫ్ మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి, నంద్యాల రీజనల్ చీఫ్ మేనేజర్ సౌజన్య దీప్తి, కేడీసీసీ బ్యాంక్ సూపర్‌వైజర్ సుబ్బరాయుడు, సబ్‌డివిజనల్ సహకార అధికారి లక్ష్మీనారాయణ, సీఈఓ సుబ్బారావు, సహకార సంఘం డైరెక్టర్ సుధాకర్, ఆర్థిక అక్షరాస్యత కోఆర్డినేటర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజర్వు బ్యాంక్ ఏజీఎం రెహమాన్

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి
- ప్రారంభమైన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు (టౌన్): క్రీడల్లో రాణిస్తే విద్యార్థినీ, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక టీక్యాంప్ క్రీడా మైదానంలో 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్–19 హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ ప్రతిభ చాటుతున్న క్రీడాకారులకు నగదు పారితోషికాలు అందజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అంతకుముందు వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ చేస్తూ అతిథుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య, రాష్ట్ర ఎస్‌జీఎఫ్ పోటీల పరిశీలకులు విజయ్ కుమార్, రాష్ట్ర రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు, పీఈటీల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కర్నూలు జట్టు శుభారంభం...

అండర్–19 బాలుర విభాగంలో కర్నూలు బాలుర జట్టు తూర్పుగోదావరి జట్టుపై 16–8 గోల్స్ సాధించింది. అనంతపురం జట్టు గుంటూరు జట్టుపై 6–4 గోల్స్ సాధించింది. కడప జట్టు ప్రకాశం జట్టుపై 15–5 గోల్స్‌తో గెలుపొందింది. కృష్ణా జిల్లా జట్టు చిత్తూరు జట్టుపై 11–9 గోల్స్ ఆధిక్యంతో గెలుపొందింది. బాలికల విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు విశాఖపట్నం జిల్లా జట్టుపై 5–1 స్కోర్‌తో గెలుపొందింది. గుంటూరు జట్టు కర్నూలు జట్టుపై 6–3 గోల్స్ ఆధిక్యత సాధించింది. కృష్ణా జిల్లా జట్టు శ్రీకాకుళం జట్టుపై 13–4 గోల్స్ తేడాతో గెలుపొందింది.

99 శాతం ఎన్నికల హామీల అమలు

- విలేకరుల సమావేశంలో ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు

కర్నూలు(సెంట్రల్): 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేసిన ఏకైక సీఎం దేశంలోనే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని గోకుల సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ తన నాలుగున్నరేళ్ల పాలనను సంక్షేమం, పాలన సంస్కరణలు, అభివృద్ధి, పరిశ్రమలుగా విభజించి చూడాలన్నారు. ఇందులో సంక్షేమానికి ఇప్పటి వరకు రూ.2.50 లక్షల కోట్లు పేదల కోసం వారి ఖాతాల్లో డీబీటీ పద్ధతిలో ట్రాన్స్‌ఫర్ చేశారని, చేస్తున్నానే ఉన్నారన్నారు. ఒకే సమయంలో 1.35 లక్షల సచివాలయ ఉద్యోగాలు, 2.50 లక్షల వలంటీర్ల నియామకం చేపట్టడం రికార్డు విషయమన్నారు. ఒకటో తేదీనే ఠంచన్‌గా వలంటీర్ల ద్వార పెన్షన్‌ను అందజేస్తున్నారన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్, డిజిటల్ లైబ్రేరీలు తదితర 50వేల భవనాలు కొత్తగా అందుబాటులోకి రావడం అభివృద్ధి కాదా అని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నేరుగా రైతులకు కావాల్సిన సాంకేతిక, విత్తనాలు, ఎరువులు అందుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు అమరావతిలో రియల్ ఎస్టేట్ చేస్తే.. వైఎస్ జగన్ రియల్ అభివృద్ధి చేసి చూపుతున్నారన్నారు. తాను 50 ఏళ్లుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ పరిస్థితులను దగ్గరుండి చూస్తున్నానని, ఈ స్థాయిలో ఏ ప్రభుత్వంలోనూ అభివృద్ధి జరుగలేదన్నారు. అందుకోసమే తాను ఏపీ నీడ్స్ వైఎస్ జగన్ అని అంటున్నానని.. దీనిపై చర్చకు తాను సిద్ధమన్నారు.

నిబంధనల సడలింపుపై ప్రభుత్వంతో చర్చిస్తా..

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ కేబినెట్‌లో చర్చించడం, జీఓ ఇచ్చారన్నారు. అయితే కొన్ని అంశాలను సడలించాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. విలేకరుల సమావేశంలో డీడీ జయమ్మ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనోత్పత్తికి కృషి



అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న వ్యవసాయశాఖ అదనపు కమిషనర్ వీడీవీ కృపాదాసు

జూపాడుబంగ్లా: తంగడంచ ఫారం భూముల్లో నాణ్యమైన విత్తనోత్పత్తికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ అదనపు కమిషనర్ వీడీవీ కృపాదాస్ తెలిపారు. గురువారం ఆయన తంగడంచ ఫారం భూములను పరిశీలించారు. ముందుగా తంగడంచ ఫారం భూముల సమగ్ర వివరాలను జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, ఫారం ఏడీఏ అరుణలత, ఏడీఏలు సాలురెడ్డి, విజయశేఖర్, ఏఓ కిషోర్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 16 ఫారాల్లో రైతులకు అవసరమైన పలురకాల బ్రీడర్ సీడ్స్ ఉత్పత్తి చేసి రైతులకు అందించటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వెస్ట్‌గోదావరి, శ్రీకాకుళం ప్రాంతాల్లో వరి విత్తనాలు, మహదేవ మంగళంలో వేరుశనగ, కనకవీడులో బీపీటీ పత్తి మూల విత్తనాలను ఉత్పత్తి చేస్తామన్నారు. తంగడంచ ఫారం భూములు అన్ని రకాల మూల విత్తనాల ఉత్పత్తికి అనుకూలంగా ఉన్నందున వేరుశనగ, కంది, పప్పుశనగ విత్తనాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. 3.50 లక్షల సర్టిఫైడ్ సీడ్స్ ఉత్పత్తిచేయాలంటే 45వేల క్వింటాళ్ల మూలవిత్తనం అవసరం అవుతుందన్నారు. తంగడంచ ఫారంలో ప్రస్తుతం 215 ఎకరాలు సాగులో ఉన్నందున మరో 270 ఎకరాలను సాగులోకి తేనున్నట్లు తెలిపారు. మొత్తంగా 500 ఎకరాల్లో వచ్చే ఖరీఫ్‌నాటికి విత్తనోత్పత్తికి సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఫారం భూముల అభివృద్ధికి రెండేళ్ల క్రితం రూ.7 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. ప్రస్తుతం నూతన ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు కృపాదాస్ తెలిపారు. ఆయన వెంట ఏఓలు కృష్ణారెడ్డి, కిశోర్, నిర్మల, తేజశ్విని, ఫారం సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: పర్యాటక శాఖ మంత్రిత్వ శాఖ 2024 సంవత్సరానికి ఉత్తమ పర్యాటక రంగాలకు సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారిణి విజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారసత్వ పర్యాటకం, వ్యవసాయ పర్యాటకం, కళాఖండాలు, బాధ్యతాయుత పర్యాటకం, శక్తివంతమైన గ్రామాలు, కమ్యూనిటీ ఆధారితం, వెల్‌నెస్ రంగాలకు సంబంధించిన రంగాల వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. www.rural.tourism. gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇందులో ఎంపికైన బెస్ట్ రూరల్ టూరిజం విలేజెస్‌ను రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో పురస్కారాలు అందజేస్తార ని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9977191550ను సంప్రదించాలని సూచించారు.

యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేయండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ సలీమ్‌బాషా

కర్నూలు(అగ్రికల్చర్): యువతలో నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసి వివిధ రంగాల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాష తెలిపారు. గురువారం కర్నూలు శివారులోని డీఆర్‌డీఏ–వైకేపీ శిక్షణ కేంద్రంలో రాయలసీమ జిల్లాలకు చెందిన సీడాప్, వాద్వాని ఆధ్వర్యంలో ఫెసిలిటేటర్‌లకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం యువత అభ్యున్నతికి పెద్ద పీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా జాబ్ మేనేజర్ కిరణ్, వాద్వాని ఫౌండేషన్ ప్రతినిధి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటాల్‌కు రూ.లలో)

పంట	కనిష్టం	గరిష్టం
వేరుశెనగ	3000	7632
పొద్దుతిరుగుడు	4489	5019
ఆముదం	4089	5459
వాము	15110	17868
ఉల్లి	517	3898
ఎండుమిర్చి	6999	22799
శనగలు	5769	5770
కందులు	10211	10211
మొక్కజొన్న	1819	2129
మినుములు	8409	8901
కొర్రలు	5719	5719
సోయాచిక్కుడు	1401	4601

ముసాయిదా జాబితాపై ముమ్మర పరిశీలన

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): ఓటరు ముసాయిదా జాబితాపై ముమ్మర పరిశీలన సాగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనా విజయవాడ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా ఓటరు సవరణ జాబితా సంక్షిప్త సవరణ–2024పై కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇతర ఎన్నికల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ ఆయనకు వివరించారు. జిల్లాలో ఫారం–6కు సంబంధించి 36,773, ఫారం–7కు 24,816, ఫారం–8కు సంబంధించి 17,592 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేయిస్తున్నట్లు చెప్పారు. రాజకీయపార్టీలు లేవనెత్తిన అంశాలను మినిట్ రూపంలో ప్రతి వారం అప్‌లోడ్ చేస్తున్నామని వివరించారు. ఫొటో సిమిలర్ ఎంట్రీస్, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్‌కు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై శనివారంలోపు విచారణ చేస్తామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన రావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదు, ఈఆర్‌ఓలు మల్లికార్జునుడు, రమ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

ఆప్షన్– 3 ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలి

జగనన్న కాలనీల్లో ఆప్షన్–3 కింద నిర్మిస్తున్న ఇళ్లలో పురోగతి కనిపంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన మండలాధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం ఆమె కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి గ్రౌండింగ్‌లో హాలహర్వి మండలం తప్ప మిగిలిన మండలాల్లో పురోగతి లేదన్నారు. వచ్చే సోమవారం నాటికి పురోగతి 95 శాతం కంటే తక్కువగా ఉంటే సంబంధిత మండలాల అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రీసర్వేకు సంబంధించి అప్పీల్స్ ఎందుకు రావడం లేదని అధికారులను ప్రశ్నించారు. డిసెంబర్ 15లోపు ఆడుదాం ఆంధ్ర పోటీలను సచివాలయాలు వారీగా మొదలుపెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాఠశాలలు, కాలేజీల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన వివరించారు. గురువారం సాయంత్రం సీఎస్ విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. కర్నూలు జిల్లాలో పశ్చిమ ప్రాంతం బాగా వెనుకబడి ఉందని కలెక్టర్ వివరించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులతో కొందరు విద్యార్థులు బడికి రావడంలేదని సర్వే తేలిందన్నారు. జిల్లాలో టీచర్ల కొరత ఉందని, ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలని సీఎస్‌కు విన్నవించారు. ఈ ప్రాంతానికి నైపుణ్య శిక్షణ ప్రత్యేకంగా ఇవ్వాల్సి ఉందని ఆమె వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈఓ రంగారెడ్డి, సీపీఓ హిమ ప్రభకార రాజు, డీపీఓ నాగరాజు నాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాల్ పాల్గొన్నారు.